

చలో.. ప్రకృతి ఒడికి

ప్రకృతి ప్రేమికులకు నిర్మల్ జిల్లా మామడ మండలం స్వాగతం పలుకుతోంది. యెంగన్న, తుర్కం చెరువులకు ఇప్పటికే వలస పక్షులు తరలివచ్చాయి. 8లో▸



ముగిసిన బేస్‌బాల్ పోటీలు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్ - 17 బేస్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 / 14.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత బాగా తగ్గుతుంది. సాయంత్రం నుంచే చలి ప్రభావం మొదలవుతుంది. వేకువ జామున చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న దివ్యాంగులు

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అదనపు కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీతో కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సత్తి సాయన్న, కో కన్వీనర్ కె.ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యం, సెక్రెటరీ కె.భగవాన్, సత్యనారాయణ, నరసయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో దివ్యంగుల సంక్షేమానికి నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థల నిర్వహణకు తప్పనిసరిగా ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం 2016 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం నవంబర్ 25లోపు నిర్మల్ జిల్లా, దివ్యాంగుల, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25 తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోని సంస్థలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వివరాలకు, సందేహాల నివృత్తికి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం(ఎఫ్-17 రూమ్‌లో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులు



లక్ష్మీప్రసాద్‌రెడ్డి



శరత్‌చందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు లభించింది. రాష్ట్ర సహాధ్యక్షులుగా ఎ.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నోముల శరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వీర్బా పాటిల్‌ను ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వీరు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంలో స్థానం దక్కించుకున్న ముగ్గురికీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏ.మురళీ మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, కోశాధికారి పోల ధర్మరాజ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ముస్కు పరమేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నిర్మల్ శివారులో చిరుత పులి

నిర్మల్‌టౌన్: నిర్మల్ శివారులో రెండు రోజులుగా చిరుత పులులు సంచరిస్తున్నట్లు సమాచారం. పట్టణ శివారు విశ్వనాథ్‌పేట్ కాలనీలోని అటవీ ప్రాంతంలో రెండు చిరుత పులు సంచరిస్తున్నాయని కాలనీవాసులు తెలిపారు. అటవీ ప్రాంతంవైపు వెళ్తుండగా వాటిని చూసిన ప్రజలు అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం అటవీ అధికారులు ఆ ప్రాంతంలో చిరుతల జాడ కోసం గాలించినట్లు సమాచారం.

పాండ్వాపూర్ తండాను సందర్శించిన డీఈవో



పాండ్వాపూర్‌తండాలో డీఈవో రవీందర్‌రెడ్డి

కడెం: మండలంలోని పాండ్వపూర్‌తండాలో పాఠశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న డీఈవో రవీందర్‌రెడ్డి సోమవారం తండాను సందర్శించారు. పాండ్వపూర్‌తండా, కాశిగూడ విద్యార్థుల సౌకర్యార్థం పాండ్వపూర్‌తండాలో పాఠశాలను పునఃప్రారంభిస్తామని తెలిపారు. డీఈవో వెంట ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశనాయకర్, ఉన్నారు.

మహిళలకు ఊరట

- వడ్డీ బకాయిలు విడుదల
- 2,566 ఎస్‌హెచ్‌జీలకు లబ్ధి
- జిల్లాకు రూ.1.10 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- డిసెంబర్‌కు ముందు బకాయిలపై స్పష్టత ఇవ్వని సర్కార్



వివరాలు:
మండలాలు 19
గ్రామ సమైక్య సంఘాలు 505
స్వయం సహాయక సంఘాలు 11,983
సభ్యులు 1,34,002

మండలాల వారీగా మాఫీ అయిన వడ్డీ..

మండలం	మాఫీ అయిన మొత్తం (రూ.లలో)
బాసర	2,26,715
భైంసా	7,24,856
దస్తురాబాద్	3,42,378
దిలావర్‌పూర్	5,65,442
కడెం	7,16,450
ఖానాపూర్	4,02,152
కుభీర్	8,05,315
కుంటాల	3,73,674
లక్ష్మణచాంద	10,82,538
లోకేశ్వరం	7,42,232
మామడ	7,48,086
ముధోల్	4,73,287
నర్సాపూర్(జి)	6,15,445
నిర్మల్ రూరల్	9,29,391
పెంబి	1,58,153
సారంగపూర్	9,85,896
సోన్	5,69,268
తానూర్	5,46,898

నిర్మల్‌చైన్‌గేట్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు చేస్తున్న బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయమై ప్రభుత్వం నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయానికి లేఖ అందింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి బకాయిలు మంజూరు చేస్తున్నట్లు ఈ లేఖలో వెల్లడించారు. జిల్లాల్లో 2,566 సంఘాలకు రూ.1.10 కోట్లు విడుదల కాగా, ఈ నిధులను వడ్డీ లేని రుణాలకు అర్హత పొందిన సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు.

జిల్లాలో 11,983 సంఘాలు..

జిల్లాలోని 11,983 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలలో 1,34,002 మంది సభ్యులుగా ఉన్నారు. సంఘాల్లోని సభ్యులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి, ఆదాయం వచ్చే ఆస్తులను కొనుగోలు చేసి, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధితోపాటు వివిధ రకాల రుణాలను అందిస్తారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీని నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ చేస్తుంది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లుగా వడ్డీ విడుదల చేయలేదు. దీంతో మహిళా సంఘాల సభ్యులు వడ్డీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ బకాయిలను వెంటవెంటనే విడుదల చేస్తోంది.

స్వయం ఉపాధి..

మహిళా సంఘాలలో సభ్యులు తీసుకున్న రుణాలతో ఇతరులపై ఆధారపడకుండా తాను ఆర్థికంగా ఎదగడంతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలో చాలాచోట్ల వివిధ రకాల రుణాలు తీసుకుని క్యాంటీన్, పెరటికోళ్ల పెంపకం, గేదెల షెడ్డు (పాల ఉత్పత్తి)తో ఇతరులకు ఉపాధి చూపించే రంగాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సభ్యులకు రుణాలను అందించటమే కాకుండా వారు ఆదాయం వచ్చే యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

పాత బకాయిల మాటేమిటి?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళా సంఘాలకు వడ్డీలేని రుణ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే అధికారంలోకి రావడంతో గతేడాది డిసెంబర్ నుంచి బకాయిలను మహిళా సంఘాల సభ్యులకు చెల్లిస్తోంది. ఇలా ఇప్పటివరకు నాలుగు నెలల బకాయిలు చెల్లించినప్పటికీ అంతకు ముందు బకాయిలపై ప్రకటన చేయకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2019–20 నుంచి వేలాది సంఘాలకు వడ్డీ బకాయిలు పేరుకుపోవడంతో వాటిని విడుదల చేస్తుందా లేదా అనే అయోమయం సంఘాల్లో నెలకొంది. అంతేకాక ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బకాయిలు కూడా అందాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి

మహిళా సంఘాల సభ్యులు సంఘం ద్వారా తీసుకున్న రుణాలు ఆదాయం వచ్చే మార్గాన్ని ఎంచుకుని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ నిధులు నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ అవుతాయి. తీసుకున్న రుణాలు వాయిదాల ప్రకారం చెల్లించి, తిరిగి రుణం పొందవచ్చు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికి అందించటం జరుగుతుంది.

– విజయలక్ష్మి డీఆర్డీవో

ముగిసిన గ్రూప్–3 పరీక్షలు

- పేపర్– 3కి 4,665 మంది హాజరు



బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. రెండో రోజు సోమవారం పేపర్– 3 పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 8,124 మంది విద్యార్థులకు 4,665 మంది(57.42 శాతం) హాజరయ్యారు. 3,459 మంది గైర్హాజరయ్యారు. శాంతినగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇందులో రీజనల్ కోఆర్డినేటర్ పీజీ.రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ రాజు ఉన్నారు.

'మహా' ఎలక్షన్ ఎఫెక్ట్..!

- జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో వైన్స్, కల్లు దుకాణాలు బంద్
- ఐదు రోజులు నిలిచిపోనున్న అమ్మకాలు

భైంసాటౌన్: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మద్యం దుకాణాల్లో అమ్మకాలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు మహారాష్ట్రకు సరిహద్దున 5 కి.మీ.ల పరిధిలో తెలంగాణలో ఉన్న వైన్స్, బార్లు, కల్లు దుకాణాలు మూసి ఉంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు జారీ చేసినట్లు భైంసా ఎక్సైజ్ సీఐ నజీర్‌హుస్సేన్ సోమవారం తెలిపారు. మహారాష్ట్రలో ఈనెల 20న పోలింగ్ ఉండగా, 23న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఈనెల 18 సాయంత్రం 6 నుంచి కౌంటింగ్ ముగిసేవరకు దుకాణాలు మూసి ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు. దీంతో భైంసా ఎక్సైజ్ శాఖ పరిధిలోని కుభీర్, తానూర్, బాసర మండలాల్లోని 22 ఆయా గ్రామాల్లో కల్లు దుకాణాలు, బాసరలో ఓ వైన్స్‌లో ఐదురోజుల పాటు మద్యం, కల్లు అమ్మకాలు నిలిచిపోనున్నాయి.

5 కి.మీ. పరిధిలోని గ్రామాలివే..

కుభీర్ మండలం హల్దా, రంగశివిని, పార్డి(బి), మార్లగొండ, బెల్గాం, పల్సి, సిర్పెల్లి, నిగ్వ, సావ్లి(1,2) మహాలింగి, బామ్ని, తానూర్ మండలంలోని బెల్‌తరోడ, బోరిగాం, మొగిలి, తొండాల, దౌల్తాబాద్, జౌల(కె), జౌల(బి), ఎల్వత్, బాసర మండలంలోని బద్రెల్లి, లాబ్ది గ్రామాల్లోని కల్లు దుకాణాలతోపాటు బాసరలోని వైన్స్ మూసి ఉండనున్నాయి.

మోతాదుకు మించి మందులు వాడొద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: మోతాదుకు మించి మందులు వాడడం అనర్థకమని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై జిల్లా వైద్య అధికారులకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీఎంహెచ్‌వో రాజేందర్ మాట్లాడుతూ మోతాదుకు మించి మందులు ఉపయోగించడం వల్ల బ్యాక్టీరియా, వైరస్ పారాసైట్స్, శిలీంద్రాలకు డ్రగ్ రెసిస్టెన్సీ కారణంగా ఇన్‌ఫెక్షన్ తగ్గక, వ్యాధి తీవ్రత పెరిగి, మరణాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. దీనిని నిరోధించడానికి, నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇద్రిస్ గౌరీ, నిర్వాహణాధికారులు రవీందర్‌రెడ్డి, సౌమ్య, రాజారమేష్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, జిల్లాలోని వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్


- పరీక్షల బహిష్కరణ కూడా..
- కేయూ వీసీకి నోటీసు అందజేత



వీసీ ప్రతాప్‌రెడ్డికి నోటీసు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

మంచిర్యాలఅర్బన్/కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం నుంచి నిరవధికంగా బంద్ చేయనున్నారు. ఈ మేరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. 90శాతం కళాశాలలు నాలుగు, ఐదు నెలల నుంచి అధ్యాపకులు, ఇతర సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గత నెలలో 14నుంచి కూడా కళాశాలలు బంద్ చేయగా అదే నెల 17న విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వారం రోజుల్లోపే విడుదలకు హామీనివ్వడంతో బంద్ విరమించామని, కానీ నేటికీ చెల్లించలేదని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే వరకూ కళాశాలలు తెరవబోమని స్పష్టం చేశారు. కేయూ పరిధిలో ఈ నెల 26 నుంచి జరిగే డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు కూడా బహిష్కరించనున్నామని స్పష్టం చేశారు. వీసీకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రవీంద్రనాథ్, బాధ్యులు జి.వేణుమాధవ్, గోలి వెంకట్, ఎం.శ్రీనివాస్, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ రాథోడ్ మోహన్‌సింగ్, సిబ్బంది ఎం.రాజు, జి.పృథ్వీరాజ్ పోటీలను పర్యవేక్షించారు.

మందెంట పోతున్న బాల్యం





రాష్ట్ర ప్రభుత్వం బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఏటా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ నిర్బంద విద్య తప్పనిసరి. కానీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాల్యం బడికి దూరమవుతోంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు బడికి వెళ్లకుండా ఇలా మేకలు కాస్తున్నారు. ఈ చిన్నారులను బడిలో చేర్పించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్

మరాఠ్వాడలో మనోళ్లు..!

- ఎనిమిది నియోజకవర్గాల్లో కీలకం..
- ప్రచారంలోనూ జిల్లా నేతలు
- 'మహా' సంగ్రామంపై స్థానికంగా ఆసక్తి



మహారాష్ట్రలో బీజేపీ తరఫున ప్రచారం చేస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: జిల్లాను ఆనుకుని ఉన్న మహారాష్ట్రలో అసెంబ్లీ పోరు జోరుగా సాగుతోంది. కాంగ్రెస్, బీజేపీ, శివసేన, ఎన్సీపీ.. ఇలా అన్ని పార్టీల మరాఠాలు అధికార సాధనే ఏకైక లక్ష్యంగా సర్వశక్తులను ఒడ్డుతున్నారు. ఇలాంటి 'మహా'పోరులో మనోళ్లు కూడా కీలకంగా ఉన్నారు. జిల్లా సరిహద్దున గల మరఠ్వాడ ప్రాంతంలోని పలు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో మనోళ్ల ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. ఈనేపథ్యంలో పార్టీలన్నీ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేయిస్తున్నాయి. మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాలో మకాం వేసి, సరిహద్దు ఆవల ఉన్న మరాఠా నియోజకవర్గాల్లో చక్రం తిప్పే పనిలో ఉన్నారు.

ఇక్కడ మరాఠీ.. అక్కడ తెలుగు..

నిజాం పాలన అటు రాయలసీమ ప్రాంతాల నుంచి ఇటు మహారాష్ట్ర వరకూ సాగింది. మహారాష్ట్రలోని నాందేడ్, పర్బణి, ఔరంగాబాద్ వరకూ నిజాం పాలనలో ఉన్నాయి. మరఠ్వాడ ప్రాంతానికి కూడా సెప్టెంబర్ 17నే విముక్తి లభించింది. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని భైంసా, బోథ్, భోకర్, కిన్వట్ ఏరియాల్లో పలు తెలుగు ప్రజలున్న గ్రామాలు మహారాష్ట్రలోకి, మరాఠీ మాట్లాడేవాళ్లు ఎక్కువగా ఉన్న ఊళ్లు తెలంగాణలోకి వచ్చాయి. ఈక్రమంలోనే జిల్లాలో ఉన్న సరిహద్దు గ్రామాల్లో మరాఠీ మాట్లాడితే.. మహారాష్ట్రలోని చాలా ఊళ్లల్లో ఇప్పటికీ తెలుగు మాట్లాడుతుండటం కనిపిస్తుంది.

బంధాలు – బంధుత్వాలు..

పక్కపక్కనే ఉండటం, భాషాబంధాలూ కలువడంతోపాటు బంధుత్వాలనూ బలంగానే కలిపేసుకుంటూ వస్తున్నారు. నిర్మల్ నుంచి నాందేడ్, పర్బణి, ఔరంగాబాద్ వరకూ బలమైన సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. ఆడబిడ్డలను అక్కడికి ఇస్తూ, అక్కడి నుంచి కోడళ్లను తెచ్చుకుంటున్నారు. కొన్ని కులాలు, కుటుంబాలు తరాలుగా మహారాష్ట్రలోని తమ బంధువులతోనే సంబంధాలు కలుపుకుంటూ వస్తున్నారు. ఇప్పటికీ ధర్మాబాద్ నుంచి కారంపొడి తెచ్చుకోవడం, నాందేడ్‌లో వైద్యం చేయించుకోవడం జిల్లావాసులకు కామన్. ప్రధానంగా సారంగపూర్, కుంటాల, కుభీర్, భైంసా, తానూరు, ముధోల్, బాసర, లోకేశ్వరం, నర్సాపూర్, దిలావర్‌పూర్, నిర్మల్ మండలాల నుంచి మహారాష్ట్ర ప్రాంతాలతో బలమైన అనుబంధాలు ఉన్నాయి.



మహారాష్ట్రలోని వర్ని నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మరఠ్వాడలో ప్రచారం చేసిన ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్

ప్రచారంలోనూ..

మహారాష్ట్ర ఎన్నికల్లో ఓట్లేయడంలోనే కాదు.. ఓట్లను రాబట్టడంలోనూ మనవాళ్లే కీలకంగా మారారు. బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహా బీజేపీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు సరిహద్దు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏకంగా సరిహద్దున భైంసాలో మకాం వేసి, మరాఠా నియోజకవర్గాల్లో చక్రం తిప్పే ప్రయత్నాలు చేశారు. ఇక పక్కనే ఉన్న రాష్ట్రం, అక్కడి వాళ్లతో బలమైన బంధుత్వాలు కలిగి ఉండటంతో మరాఠాపోరులో ఎవరు గెలుస్తారనే దానిపైనే జిల్లా అంతా చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు బుధవారమే ఉండటంతో జిల్లాలో ఉన్న మరాఠాలు ఇప్పటికే తమ సొంతప్రాంతాలకు వెళ్లిపోయారు.

ఎనిమిది చోట్ల కీలకం..

జిల్లాతోపాటు తెలంగాణ ప్రజలు మహారాష్ట్రలోని చాలాప్రాంతాల్లో స్థిరపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో బలంగా ఉన్నారు. సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని ధర్మాబాద్, భోకర్, కిన్వట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జిల్లాతో సంబంధాలు కలిగిఉన్నవారు, అక్కడ స్థిరపడిన జిల్లా వాసులు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేస్థాయిలో ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటముల్లోనూ వీరి ఓట్లే కీలకం కానున్నాయి. ఇక నర్సి, నయగావ్, నాందేడ్, దెగ్లూర్ నియోజకవర్గాల్లోనూ జిల్లా సంబంధీకుల ఓటర్లు ప్రభావితంగానే ఉన్నారు. ఇక చాలామందికి జిల్లాతోపాటు మహారాష్ట్రలోనూ ఓట్లు ఉండటం గమనార్హం. భోకర్, ధర్మాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన చాలా కుటుంబాలు భైంసా, నిర్మల్, ఖానాపూర్ ప్రాంతాల్లో స్థిరపడ్డాయి. ఇప్పటికీ వారు రెండుచోట్ల ఓట్లు వేస్తున్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయం నుంచి గోదావరినదికి వెళ్లే దారిలో ఓ లాడ్జీ పక్కన సోమవారం గుర్తుతెలియని వ్యక్తి (42) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతుడు నీలిరంగు గీతల షర్టు, నీలిరంగు లుంగీ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్: వ్యక్తిపై హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కే.యువరాజ సోమవారం తీర్పు చెప్పారు. దహెగాం ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం చిన్నరాస్పెల్లికి చెందిన సాపిల బాపు 2022 అక్టోబర్ 27న పొలంపనికి వెళ్లిన సమయంలో అదే మండలం ఒడ్డుగూడకు చెందిన బుర్సా పోశం పాత కక్షలతో కత్తితో దాడి చేశాడు. బాపు భార్య కళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.


మహిళను ఢీకొట్టిన టిప్పర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన అనితకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. సోమవారం తాంసి బస్టాండ్ వద్ద అనిత కాలినడకన వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఆమె కాలుపైనుంచి వెళ్లింది. దీంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తాండూర్: చోరీ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. తాండూర్ మండలం పెగడపల్లికి చెందిన చిప్పకుర్తి తిరుపతి ఇంటికి తాళం వేసి ఉండగా ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 81 గ్రాముల అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకున్న ఎస్సై కిరణ్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించి అదే గ్రామానికి చెందిన వేల్పుల సిద్దార్థ అలియాస్ సిద్దును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

గ్రూప్-3లో నిర్మల్ జిల్లా ప్రశ్నలు



రాంజీగోండ్‌పై వచ్చిన ప్రశ్న ఇదే

నిర్మల్‌ఖిల్లా: గ్రూప్–3 పరీక్షల్లో నిర్మల్ జిల్లా ప్రస్తావన వచ్చింది. గిరిజన పోరాట యోధుడు రాంజీగోండ్‌కు సంబంధించిన ప్రశ్నలు చోటు చేసుకోవడం విశేషం. ఆదివారం జరిగిన రెండవ పేపర్‌లో 18వ శతాబ్దం నాటి రాంజీగోండ్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన అంశాలపై ప్రశ్న కనిపించింది. రాంజీగోండ్‌కు సంబంధించిన నాలుగు అంశాలను ఇచ్చి సరైన వాటిని గుర్తించమని అడిగారు. రాంజీగోండ్ సహా వెయ్యిమంది యోధులను ఉరి వేసిన ప్రాంతం, రాంజీగోండ్ స్మారక స్తూపం ఎక్కడ ఉందనే అంశాలపై ప్రశ్నించారు. సోమవారంనాటి మూడవ పేపర్‌లో కూడా జనాభా గణాంకాలపై నిర్మల్ జిల్లా ప్రస్తావన రావడం గమనార్హం.

చలో.. ప్రకృతి ఒడికి..

- స్వాగతం పలుకుతున్న యెంగన్న చెరువు, తుర్కం చెరువు
- అతిథిగా వచ్చిన రకరకాల పక్షులు
- 23, 24 తేదీల్లో నేచర్ క్యాంపు
- అటవీశాఖ ఆధ్వర్యంలో బర్డ్ ఫెస్టివల్
- హైదరాబాద్ నుంచి రానున్న అధికారుల బృందం

కొంగ జాతి పక్షులు







శ్రీపర్ణ మునియ

మామడ(నిర్మల్): ఎంతటి పని ఒత్తిడిలో ఉన్నవారికైనా కొంత సమయం ప్రకృతి ఒడిలో గడిపితే ఒత్తిడి తగ్గి సరికొత్త ఉత్సాహం కలుగుతుంది. ప్రకృతి పంచే ఆహ్లాదం ఆస్వాదిస్తే నూతనోత్తేజం కలుగుతుంది. ఇందుకోసం ప్రకృతి ప్రేమికులు ఎంతదూరమైనా వెళ్లి ఆహ్లాదం పొందుతున్నారు. పక్షుల కేంద్రంగా జిల్లాలో పేరు పొందిన తుర్కం, యెంగన్న చెరువుకు ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో సుదూర ప్రాంతాల నుంచి పక్షులు వలస వచ్చి కొద్దిరోజులు ఇక్కడే నివాసం ఉంటాయి.

1913లో చెరువుల నిర్మాణం

నిర్మల్ జిల్లా మామడ మండలం నల్దుర్తి సమీపంలోని అటవీప్రాంతంలో తుర్కం చెరువు, పొన్కల్ సమీపంలోని యెంగన్న చెరువును నిజాం హయాంలో 1913లో నిర్మించారు. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి 25 కిలోమీటర్ల దూరంలో దిమ్మదుర్తి నుంచి నల్దుర్తి వెళ్లే రోడ్డు సమీపంలో తుర్కం చెరువు ఉంటుంది. దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో యెంగన్న చెరువు ఉంటుంది. జంతువుల దాహార్తిని తీర్చడంతో పాటు ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచే విధంగా చెరువులను నిర్మించారు. వీటికి రెండు కిలోమీటర్ల దూరంలో విశ్రాంతి భవనం నిర్మించారు. సుదూర ప్రాంతాల నుంచి వేటకోసం వచ్చిన వారు విశ్రాంతి భవనంలో సేదతీరే వారని గ్రామస్తులు చెప్తుంటారు.

పక్షి ప్రేమికులకు కనువిందు...

చెరువులను టూరిజం పరంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తుర్కం చెరువు నుంచి యెంగన్న చెరువుకు వెళ్లేందుకు మూడు కిలోమీటర్ల మేర ట్రాక్‌నిర్మించారు. చెరువుల పరిసరాలలో కొన్ని నిర్మాణాలను కూడా చేపట్టారు. సుదూర ప్రాంతాల నుండి వలస వస్తున్న పక్షులు కొద్ది మాసాలుగా ఈ చెరువుల పరిసరాల్లో నివాసం ఉంటున్నాయి. కొంగలు, ఈగల్స్, చిలుకలు వంటి వివిధ రకాల పక్షులతో చెరువులు కనువిందు చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి హైటికోస్ బృందం ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లాలోని యెంగన్న చెరువు, తుర్కం చెరువుతో పాటు మంచిర్యాల జిల్లాలోని కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టును సందర్శించనుంది. మొదట తుర్కం చెరువును సందర్శించి పక్షులను తిలకించిన అనంతరం కవ్వాల్‌లో అభయారణ్యంలో సఫారి, ట్రెక్కింగ్ వంటి అంశాల్లో పాల్గొంటారు. రాత్రి తుర్కం చెరువు సమీపంలో ఏర్పాటు చేసే క్యాంపులో పాల్గొంటారు. హైదరాబాద్ నుంచి వచ్చే సందర్శకుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు

మామడ మండలంలోని దిమ్మదుర్తి రేంజ్ పరిధిలో ఉన్న తుర్కం చెరువు, యెంగన్న చెరువులు పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో వివిధ ప్రాంతాలనుంచి రకరకాల పక్షులు ఇక్కడికి వలస వస్తుంటాయి. వీటిని వీక్షించేందుకు ఈ నెల 23, 24 తేదీలలో హైదరాబాద్ నుండి అధికారులు, పర్యాటకులు రానున్నారు. – శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్‌వో, దిమ్మదుర్తి రేంజ్

నాన్న.. అనిపించుకోకుండానే..

- భార్య పురిటి కోసం వచ్చి దుర్మరణం చెందిన ఆర్మీ జవాన్
- తమ్ముడి అత్త అంత్యక్రియలకు వెళ్తూ మరో వ్యక్తి..
- ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు
- మంచిర్యాల జిల్లా దొరగారిపల్లెలో ఘటన
- రెండు కుటుంబాల్లో విషాదం నింపిన రోడ్డు ప్రమాదం



ముల్క ఉదయ్ (ఫైల్)



పత్తి నర్సింహ (ఫైల్)

నస్పూర్: తెల్లవారితే తనకు పుట్టబోయే బిడ్డను ఎత్తుకుని మురిసిపోదామనుకున్న ఒకరు నాన్న అనే పిలుపునకు నోచుకోకుండానే, తన సోదరుని అత్త మరణ వార్త తెలుసుకుని అతన్ని ఓదార్చుదామనుకున్న మరోవ్యక్తిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్న సంఘటన మంచిర్యాల జిల్లాలోని దొరగారిపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని దొరగారి పల్లెకు చెందిన ముల్క ఉదయ్ ఆదివారం రాత్రి పని నిమిత్తం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన పత్తి నర్సింహ తన భార్య రమాదేవితో కలిసి ద్విచక్ర వాహనంపై గద్దెరాగడికి బయలుదేరాడు. దొరగారిపల్లె గ్రామ సమీపంలో 200 పీట్ల సర్వీస్ రోడ్డు వద్దకు రాగానే ఇరువురి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఉదయ్, నర్సింహ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

భార్య డెలివరీకి వచ్చి...

ముల్క ఉదయ్ భోపాల్ రాష్ట్రంలో ఆర్మీ జవానుగా ఉద్యోగం చేస్తున్నాడు. మంచిర్యాలకు చెందిన పావనితో 2022లో వివాహమైంది. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి. ఆమె డెలివరీ కోసం పదిరోజుల క్రితం ఇంటికి వచ్చాడు. వైద్యులు ఆమెకు సోమవారం డెలివరీ సమయం ఇచ్చినట్లు సమాచారం. తెల్లవారితే తనకు ముద్దులొలికే చిన్నారి జన్మిస్తుందని అతను కన్న కలలు నెరవేరకుండానే ఇలా మృత్యువు కబళించడం కుటుంబ సభ్యులను తీవ్ర మనోవేదనకు గురిచేసింది.

సోదరుని పరామర్శించేందుకు వెళ్తూ...

నస్పూర్‌కాలనీలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న పత్తి నర్సింహకు 2014లో రమాదేవితో వివాహమైంది. గద్దెరాగడిలో నివాసం ఉండే తన సోదరుని అత్త మృతి చెందిన విషయం తెలుసుకున్న నర్సింహ ఆదివారం రాత్రి రమాదేవిని బైక్‌పై ఎక్కించుకుని గద్దెరాగడికి బయలుదేరాడు. నర్సింహను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడం, అతని భార్య గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

గ్రామంలో విషాదం..

ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు ఒకే ప్రమాదంలో మృతి చెందడంతో దొరగారి పల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

‘సమస్యలు పరిష్కరించకుంటే స్వయంపాలన’



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఇచ్చోడ: నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో స్వయం పాలన ప్రకటిస్తామని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1/70 చట్టం, పంచాయతీరాజ్ విస్తీర్ణ చట్టం (పెసా) ప్రకారం ఇచ్చోడలో ఎన్ని కుటుంబాలకు భవన నిర్మాణ అనుమతులు ఉన్నాయో సంబంధిత అధికారులు తెలియజేయాలన్నారు. ఒకవేళ అనుమతులు ఇచ్చి ఉంటే ఏజెన్సీ చట్టాలకు ఇది విరుద్ధమన్నారు. ఈనెల 30 వరకు భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోకుంటే ఇచ్చోడలో తామే స్వయం పాలన ప్రకటిస్తామని స్పష్టం చేశారు. గిరిజనేతరులకు వ్యతిరేకం కాదని, కానీ 1970 తర్వాత వలసవాదం పెరిగి సమస్యలకు దారి తీస్తోందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వలసవాదులకు ఓటు హక్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న మేడిగూడ రాయిసెంటర్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఆత్రం మహేందర్, మెస్రం శంభు, మడావి భీంరావు, కాత్లే విఠల్, సంగెం రమేశ్, చాకటి పవన్, పెందూర్ రమేశ్, తలాండే ప్రభు, పెందూర్ శంకర్, మెస్రం దేవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో వసంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జైనథ్ మండలం తారోడాకు చెందిన ఈశ్వర్ కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించాలని, ఉట్నూర్ మండలం తేజాపూర్‌కు చెందిన నాగోరావ్ ఆర్థికసాయం అందించాలని, తలమడుగు మండలం ఝరికి చెందిన స్వాతి బ్యూటీపార్లర్ కోసం రుణం ఇప్పించాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి’

ఉట్నూర్‌రూరల్: మానసిక దివ్యాంగ విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు పెందూర్ త్రిమూర్తి, ప్రధాన కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం కేబీ ప్రాంగణంలో గల వికాసం ప్రత్యేక పాఠశాల ఎదుట ఘటనను నిరసిస్తూ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి పాఠశాలలో విద్యార్థులు కొట్టుకోవడంతో నైట్ డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సదరు విద్యార్థులు మన్విత్, విశ్వనాథ్‌ను కర్రతో వీపుపై చితకబాదాడన్నారు. విషయం తెలుసుకున్న ఏటీడీవో క్రాంతి కుమార్ విద్యార్థి నాయకులతో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు మోతీరాం, తుకారాం, కోటేష్, సంతోశ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తానూరు: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన గాయక్‌వాడ్ గణేశ్ (36)కు పదేళ్ల క్రితం ఎల్వి గ్రామానికి చెందిన జానాబాయితో వివాహమైంది. అప్పటి నుంచి ఎల్విలోనే నివాసం ఉంటున్నాడు. మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అతని భార్య గర్భందాల్చింది. ఆస్పత్రిలో చూపించేందుకు డబ్బులు లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకున్నాడు. సోమవారం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య జానాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..

కుభీర్: కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల మేరకు దొడర్నా రెండుకు చెందిన చవాన్ గులాబ్ (58) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం కడుపునొప్పి రావడంతో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. విషయాన్ని కుమారుడు గణేశ్‌కు చెప్పడంతో 108లో భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుమారుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

కోటపల్లి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్రీనివాస్ అన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో రాపన్‌పల్లివద్ద చెక్‌పోస్టును సీపీ శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.4లక్షల విలువ చేసే మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, అడిషనల్ అడ్మిన్ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్సై సుబ్బారావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

గుంజాల శివారులోనే పెద్దపులి

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు

నార్నూర్: రెండు రోజులుగా పెద్దపులి మండలంలోని గుంజాల శివారులోనే మకాం వేసింది. సోమవారం ఉదయం గుంజాల గ్రామానికి చెందిన మెస్రం హన్మంత్‌రావు తన పంటచేనులో గడ్డి కోస్తుండగా పులి కనిపించడంతో వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్‌వో గోపాల్‌సింగ్ పులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించి పాదముద్రలు గుర్తించారు. 24 గంటల నుంచి పులి శివారు ప్రాంతంలోనే ఉండడంతో ఖంపూర్, మాదాపూర్, తాడిహత్నూర్, మహగావ్, చోర్గావ్, తదితర సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌వో మాట్లాడుతూ పులి గుంజాల గ్రామ శివారులోనే ఉందని, ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లవద్దని, పశువులను మేతకోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లవద్దని సూచించారు. పంటచేలలో సోలార్ జట్కా మిషన్, విద్యుత్ తీగలను అమర్చవద్దని హెచ్చరించారు. కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని రాసిమెట్ట, భూసిమెట్ట ప్రాంతంలో ఆడపులి ఉందని, గుంజాల శివారు నుంచి పెద్దపులి జైనూరు శివారులోకి వెళ్లే అవకాశం అధికంగా ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి ఎక్కడ కనిపించినా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ఆవును హతమార్చిన పెద్దపులి



ఆవు కళేబరం

నార్నూర్: మండలంలో ని చోర్గావ్ గ్రా మ శివారులో సోమవారం సాయంత్రం తార్యానాయక్ అనే రైతుకు చెందిన ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఆదివారం ఉదయం ఉట్నూర్ చిన్నునాయక్ తండా, హస్నాపూర్, చాందోరి మీదుగా మండలంలోని గుంజాల శివారుకు చేరుకున్న పెద్దపులి మధ్యాహ్నం నుంచి అదే ప్రాంతంలో తలదాచుకుంది. రాత్రి జైనూర్ లేదా బేల మీదుగా వెళ్లిపోతుందని అటవీశాఖ అధికారులు భావించారు. కానీ సోమవారం గుంజాల వద్ద ప్రత్యక్షం కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. సాయంత్రం చోర్గావ్ శివారులో ఆవుపై దాడి చేసి బాబేఝరి వైపు మళ్లిందని స్థానికులు పేర్కొంటున్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

- రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్



బాలామృతం అందజేస్తున్న ఎంఏ ఫహీమ్

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. భుక్తాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కవిత ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు, గర్భిణులు బాలింతలకు అందించే భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శాంతినగర్, మహాలక్ష్మివాడలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 35వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో 15 లక్షల మంది చిన్నారులకు బాలామృతం అందిస్తున్నామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్ వారు యూనిసెఫ్‌తో కలిసి పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహించి పౌష్టికాహార లోపం నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి సబితా, ఏసీడీపీవో మిల్కా, సీడీపీవో వనజ, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో పిల్లల హాజరు పరిశీలించి, చిన్నారులకు ఇస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు



ద్వితీయస్థానంలో నిలిచిన ఆదిలాబాద్ బాలికల జట్టు



ద్వితీయస్థానంలో నిలిచిన ఆదిలాబాద్ బాలుర జట్టు

- ద్వితీయస్థానంలో నిలిచిన ఆదిలాబాద్ జట్లు

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–17 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి 8 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. చివరిరోజు హోరాహోరీగా సాగిన పోరులో ఉమ్మడి ఆదిలాబాద్ జట్లపై నిజామాబాద్ జట్లు విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచాయి. బాలబాలికల విభాగంలో ద్వితీయస్థానంలో ఆదిలాబాద్, తృతీయస్థానంలో నల్గొండ జట్లు నిలిచాయి. విజేతలకు ముఖ్యఅతిథి డాక్టర్ అవినాష్, పేట (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేశ్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, స్టేట్ అబ్జర్వర్లు గంగామోహన్, పాషా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పేట జిల్లా సెక్రెటరీ భోజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్, రామారావు, వంశీ, సంజీవ్, అన్నపూర్ణ, జమున, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో తృతీయస్థానం



తృతీయస్థానంలో నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాల్‌బాల్ అండర్–14 బాలికల విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సత్తా చాటింది. పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం కరీంనగర్–ఉమ్మడి ఆదిలాబాద్ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ చెరుకు ఫణిరాజా తెలిపారు. జిల్లా జట్టు నుంచి ప్రాతినిథ్యం వహించిన క్రీడాకారులను డీఈవో యాదయ్య, జిల్లా కోచ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేషనల్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక



విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్‌ఎం కిషన్‌రెడ్డి

బజార్‌హత్నూర్: ఖమ్మంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ మీట్ 2024–25లో జాతర్ల గ్రామంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్ అండర్–14 విభాగంలో కే.జకేష్ 200 మీటర్లు, 600 మీటర్ల పరుగుపందెంలో, రాథోడ్ కార్తీక్ 100 మీటర్లు, లాంగ్‌జంప్‌లో, మనోజ్ అథ్లెటిక్స్ 800 మీటర్ల హర్డిల్స్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో నిర్వహించే స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికయ్యారు. సదరు విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రెడ్డి, కోచ్ సాహుల్, పీడీ మోహన్‌సింగ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండ శివారులోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు లక్సెట్టిపేట మండలం ముత్యంపేటకు చెందిన రత్నం అశోక్, గందం భాస్కర్ ద్విచక్ర వాహనంపై మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వెళ్తుండగా మహారాష్ట్రలోని నగరం గ్రామానికి చెందిన రాజారాం కుటుంబం ఆటోలో లక్సెట్టిపేట మండలం గూడెం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో దొనబండ పెట్రోల్ బంక్ వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న అశోక్, భాస్కర్‌తో పాటు ఆటోలో ఉన్న రాజారాంకు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

క్లుప్తంగా

నాణ్యమైన విద్యనందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

తానూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు కనీసం చదడం రాయడం తప్పనిసరిగా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

కుభీర్: మండలంలోని దావుజీనాయక్ తండా పాఠశాలను సోమవారం ఎంఈవో విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం


మాట్లాడుతున్న ఖాజా మొహినుద్దీన్

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎండీ ఖజా మొహినుద్దీన్ తెలిపారు. నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు మత రాజకీయాలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. అనంతరం పార్టీలో చేరిన మంచి కంటా లక్ష్మణ్, సహదేవ్‌లకు కండువా కప్పారు. నాయకులు రాజయ్య, లక్ష్మీకాంతం ఉన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాజన్న ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం నిర్మల్‌లో ఆయన్ను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, సత్యనారాయణ గౌడ్, సోలంకి భీంరావు, పిప్పెర వెంగళరావు ఉన్నారు.

ప్లేట్ల విరాళం


విద్యార్థులకు ప్లేట్లను అందిస్తున్న గంగాప్రసాద్

కుంటాల: భైంసా జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం గంగాప్రసాద్ భార్య రాచేవాడు పద్మావతి స్మారకార్థం స్టీల్ ప్లేట్లను సోమవారం విద్యార్థులకు విరాళంగా అందజేశారు. రూ.10 వేల విలువ గల వంద ప్లేట్లు అందించారు. దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో ముత్యం, ఉపాధ్యాయులు నరేశ్, పాండుసింగ్, వికారుద్దీన్, చంద్ర నాగాకాంత్, రతన్ కుమార్, గంగాధర్, సాహెబ్‌రావు, ధర్మాజీ, మారుతి, ముఖీమ్, రిటైర్డ్ టీచర్ గజ్జారాం పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ముధోల్: మండలకేంద్రానికి చెందిన కోలీగల్లీలో సోమవారం కుక్కల దాడిలో రెండు మేకల మృత్యువాతపడ్డాయి. ఇంటి ఆవరణలో ఉన్న మేక మందపై కుక్కలు దాడి చేయగా రెండు మేకలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ. 20వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు నిఖిల్ కోరాడు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, రోటిబండ, పులిచెర్లకుంట తండాలో ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం గిరిజన రైతుల భూములను లాక్కోవాలని చూస్తున్న ప్రభుత్వ కుట్రను తిప్పికొడదామని బీఆర్‌ఎస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. జాదవ్ శ్రీనివాస్, అంబర్ సింగ్, ఉత్తం ఉన్నారు.

పట్టు తప్పితే..అంతే!

కుంటాల మండలంలోని తిమ్మాపూర్ జోడువాగులపై నిర్మించిన వంతెన గతేడాది మార్చిలో కూలిపోయింది. రైతులకు అవతలి ఒడ్డున వ్యవసాయ భూములు ఉన్నాయి. అక్కడికి చేరేందుకు వాగులో నీటిపైపు ఏర్పాటు చేసుకుని ఇలా ప్రమాదకరంగా వెళ్తున్నారు. నిత్యం వ్యవసాయ పనుల కోసం వారికి ఫీట్లు తప్పడం లేదు. పట్టుతప్పి పడిపోతే ప్రమాదమని తెలిసినా ఇలా వెళ్తున్నారు.


నీటి పైపు నుంచి చేనుకు వెళ్తున్న రైతు

- వంతెన లేక కష్టాలెన్నో!
- వాగు దాటేందుకు తప్పని ఫీట్లు
- ప్రమాదకరంగా నీటిపైపు ద్వారా వెళ్తున్న రైతులు
- పట్టించుకోని పాలకులు

తెప్ప ఏర్పాటు చేయించా



గతేడాది వంతెన కూలింది. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రూ.6 వేలు వెచ్చించి తెప్ప ఏర్పాటు చేయించా. తెప్ప ద్వారా వ్యవసాయ పనులకు వెళ్లి వస్తున్నాం.

– జాదవ్ సకేత్, రైతు, కల్లూరు

వంతెన నిర్మించాలి



వంతెన అవతలి వైపు లోకేశ్వరం మండలంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. భైంసా మండలం మీదుగా వెళ్లాలంటే దూరభారంతోపాటు వ్యయ ప్రయాసాలు తప్పడం లేదు. అధికారులు వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకట్‌రావు, రైతు, బురుగుపల్లి (కే)


తెప్ప సహాయంతో వెళ్తున్న రైతు

కుంటాల: మండలంలోని తిమ్మాపూర్ జోడువాగులపై నిర్మించిన వంతెన కూలిపోయింది. దీంతో అవతలి ఒడ్డుకు వెళ్లాలంటే రైతులు, మత్స్యకారులు ఓ పైపును ఏర్పాటు చేసుకుని ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం తెప్ప, నీటిపైపు ద్వారా వెళ్తున్నారు. వంతెన కూలిన చోట 25 నుంచి 30 అడుగుల లోతున నీరు ఉంటుంది. ఇలా అష్టకష్టాలు పడుతున్నా వంతెన నిర్మించడం లేదని రైతులు వాపోతున్నారు. వంతెన అవతలి వైపు సుమారు 250 ఎకరాల సాగు భూమి ఉండడంతో ప్రతినిత్యం వ్యవసాయ పనులకు వెళ్లి రావాలంటే తిప్పలు పడుతున్నారు. వంతెన కూలడంతో కల్లూరు నుంచి వాగుపై పంట పొలాలకు వెళ్లాలంటే 2 కి.మీ దూరం ఉంటుంది. భైంసా మండలం వానల్‌పాడ్ నుంచి పెండ్‌పెల్లి మీదుగా వెళ్లాలంటే 15 కి.మీ వెళ్లాల్సిన పరిస్థితి. అయినా ఉన్నతాధికారులు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం లేదు.

అర్లి(కె)లో పునరావాసం

ఎస్సారెస్పీ నిర్మించే సమయంలో బ్యాక్‌వాటర్ వస్తుందని ఉమ్మడి కుంటాల మండలంలోని కల్లూరు, బూరుగుపల్లి(కే), మోతక్‌పల్లి, అర్లి(కె) గ్రామాల రైతుల భూములు కోల్పోయారు. అప్పటి ప్రభుత్వం వీరికి కల్లూరు 61 జాతీయ రహదారి పక్కన అర్లి(కె)లో పునరావాసం కల్పించారు.

యువ రైతు వినూత్న ఆలోచన

రాకపోకలకు దూరభారం తగ్గించేందుకు మండలంలోని బూరుగుపల్లి(కే) గ్రామానికి చెందిన యువ రైతు జాదవ్ సకేత్ (అశ్విన్) వినూత్న ఆలోచన చేశాడు. రూ.6 వేలు వెచ్చించి తెప్ప తయారు చేయించాడు. తాడుతో తెప్పను వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చే ఆలోచన చేశాడు. తెప్పకు తాడు ఏర్పాటుచేసి అటు..ఇటు వెళ్లేలా చేశాడు. ట్రాక్టర్ ద్వారా భైంసా మండలం, వానల్‌పాడ్ మీదుగా వెళ్లి రావాలంటే రూ.1200 ఖర్చు అయ్యేవి. ఇలా చేయడం ద్వారా రూ.200 మాత్రమే ఖర్చవుతుంది.

మాలల సింహగర్జనకు తరలిరావాలి


భైంసాటౌన్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు

భైంసాటౌన్: సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభకు తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ తాలూకా అధ్యక్షుడు శంకర్‌చంద్రే పిలుపునిచ్చారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో సోమవారం కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు అన్ని గ్రామాల నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవిదాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు సాహెబ్‌రావు, సురేష్ శానే, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి, జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, కన్కపూర్ తదితర గ్రామాల్లో సోమవారం మాలల సింహా గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు దండే రమేశ్, రాజు, గంగాధర్, పోశెట్టి, మహేశ్, నరేశ్, లింగన్న, రాజన్న, ప్రవీణ్, దేవన్న, భోజన్న, దేవన్న ఉన్నారు.

తానూరు: మాలల సింహా గర్జను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. మండలంలోని దౌలతాబాద్, ఎల్వత్ ,జౌలా(కే) గ్రామాల్లో సోమవారం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు అంబదాస్ పవార్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి


బాదన్‌కుర్తిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

లోకేశ్వరం: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు.మండలంలోని బాగాపూర్, నగర్ గ్రామాల్లో నిర్వహించే సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి, రాజకీయ కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా ఫారంలు నింపాలన్నారు. ఇంటింటికి వెళ్లి వివరాలను ఫారంల్లో నమోదు చేయాలన్నారు. ఎంపీవో సోలమాన్‌రాజ్, సీనియర్ అసిస్టెంట్ సురేశ్‌గౌడ్ ఉన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

ఖానాపూర్: గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్న అధికారులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సునీత కోరారు. మండలంలోని బాదన్‌కుర్తిలో సోమవారం ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎంపీవో రత్నాకర్‌రావు, కార్యదర్శి సురెందర్, తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో 9 రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసులో నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్సై జి.అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మిట్టపల్లి లక్ష్మణ్ తాను దొంగిలించిన బంగారం, డబ్బుతో జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో కారు కొనుగోలు చేసేందుకు వెళ్తూ సోమవారం కమ్మర్‌పల్లి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఈనెల 9న హాసాకొత్తూర్‌లోని నాయిని పురుషోత్తం ఇంట్లో చోరీకి పాల్పడడంతోపాటు ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.1.80 లక్షల నగదు, రెండు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జి.అనిల్‌రెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన


సోన్‌లో ధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న ఏఈవో ఉమామహేశ్వరి

సోన్: మండల కేంద్రంతోపాటు కూచన్‌పల్లి, జాఫ్రపూర్, గంజాల్, మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవోలు పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో జరిగే రైతు నేస్తంలో వరి కొయ్యలకు నిప్పు వల్ల నష్టాల గురించి శాస్త్రవేత్తలు వివరిస్తారని తెలిపారు. ఏఈవోలు జాదవ్ ఉమమహేశ్వరి, ప్రగతి, అశోక్‌కుమార్ రైతులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ధాన్యం తేమ శాతం, సన్నరకం ధాన్యాన్ని ధ్రువీకరించే డిజిటల్ మీటర్ (గ్రెయిన్ క్యాలిపర్)ను పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ వేణుగోపాల్, నిర్వాహకుడు సంతోష్, రైతులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం


బోకర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

సారంగాపూర్: మహారాష్ట్రలోని కిన్వట్ నియోజకవర్గ అభ్యర్థి కేరాం భీంరావు తరఫున కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. అప్పారావుపేట్, శివిని, దయ్యాల్ ధన్నూర్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నారాయణరెడ్డి, నవీన్, తదితరులు ఉన్నారు.

కుభీర్: మహారాష్ట్రలోని భోకర్ కాంగ్రెస్ అభ్యర్థి తరఫున కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. భోకర్, పరిసర గ్రామాల్లో ప్రచారం చేశారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. భైంసా మార్కెట్ చైర్మన్ ఫారుఖ్, మైనార్టీ నాయకుడు జావెద్‌ఖాన్, కుభీర్ మండల అధ్యక్షుడు జయరాం, నాయకులు విలాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా భీమన్న జాతర


లక్ష్మణచాంద: మల్లాపూర్‌లో పాల్గొన్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌లో భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో భీమన్న గదలను గ్రామస్తులు గోదావరినదికి తరలించారు. అనంతరం వాటితో సోమవారం ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్ని గుండం గుండా భక్తులు దాటారు.

మామడ: మండలంలోని అనంతపేట్, పొన్కల్ గ్రామాల్లో సోమవారం భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం భక్తులు ఆలయాల నుంచి భీమన్న ఉత్సవ విగ్రహాలను గోదావరినదికి తీసుకువెళ్లి స్నానామచరింపజేశారు. అనంతరం ఆలయానికి చేరుకుని విగ్రహాలను అలంకరించారు. తర్వాత స్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి వీక్షించారు.

'వ్యయ'సాయం

- పంట నూర్పిడులకు కూలీల కొరత
- వరికోత యంత్రాలకు పెరిగిన డిమాండ్
- ధరల పెంపుతో లబోదిబోమంటున్న రైతులు


లోకేశ్వరంలో హార్వెస్టర్‌తో కోత కోస్తున్న వరి

లోకేశ్వరం: అకాల వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చింది. పెట్టుబడికి పెట్టిన ఖర్చులు పోను అప్పుచేసే పరిస్థితి ఉంది. ఓ వైపు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికచ్చే సమయంలో వర్షాలు దెబ్బతీశాయి. మరోవైపు కూలీల కొరత, నారుమడి నుంచి పంట నూర్పిడి దాకా అన్ని ఖర్చులు తడిసిమోపడవుతున్నాయి. వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. ధరల పెంపుతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

దెబ్బతిన్న పంటలు

వానాకాలం సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అక్టోబర్‌లో కురిసిన వర్షాలు పంటలను దెబ్బతీశాయి. ఆరుతడి పంటలైన పెసర, మినుము, సోయా చిక్కుడు, పత్తి, మొక్కజొన్నతోపాటు పలు పంటలకు నష్టం వాటిల్లింది. వరి పొలాలు నేలకొరిగాయి. వర్షపు నీటికి వరిపైరు కుళ్లి మొలకలు వచ్చాయి. ధాన్యం గింజలు బురద నీటి పాలయ్యాయి.

పెరిగిన కూలీ రేట్లు

వరి పంటలు, ఆరుతడి పండిస్తున్న రైతులకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. మహిళా కూలీలు ముందుకు రాకపోవడంతో పంట నూర్పిడికి రైతులు యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. అరకొరగా వస్తున్న కూలీలకు ధర పెరిగింది. దాంతో కూలీలతో వ్యవసాయ పనులు చేయించడానికి రైతులు జంకుతున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న నిర్వాహకులు యంత్రాలను అద్దెకు ఇస్తున్నారు.

భారంగా పెట్టుబడి ఖర్చులు

ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించిన రైతులకు పెట్టుబడి ఖర్చులకు మించిన భారంగా మారాయి. ముఖ్యంగా పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు దెబ్బతీయడంతో ఖర్చులు మరింత పెరిగాయని పలువురు వాపోతున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల పెట్టుబడి కోసం ఖర్చు చేస్తున్నారు. ఈసారి పంట నష్టం కావడంతో దిగుబడి అంతంతగానే వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నేలకొరిగిన వరి

వర్షాలతో నష్టం



ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి పొలాలు నేలకొరిగాయి. పొట్టదశ నుంచి వర్షాలు దంచికొట్టడంతో పంట నష్టం వాటిల్లింది. యంత్రాల ద్వారా కోత కోయించిన దిగుబడి మాత్రం రావడం లేదు.

– చిన్నోల్ల భోజారెడ్డి, ధర్మోర

రూ.3 వేల ఖర్చవుతుంది



ఎకరా నూర్పిడికి మిషన్లకు రూ.3 వేలు అవుతుంది. వర్షాలకు పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి పెరిగి అప్పులు మిగులుతున్నాయి. నష్ట పరిహారం చెల్లిస్తే తప్పా రైతులు అప్పుల ఊబి నుంచి గట్టెక్కే పరిస్థితులు లేవు.

– శ్రీనివాస్, ధర్మోర, రైతు

అటెన్షన్ ప్లీజ్.. చేతిపంపునకు మరమ్మతు చేయాలి



లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని తిర్పెల్లి వాగు సమీపంలో గల అతి పురాతన శివాలయం ఉంది. ఇక్కడ చేతిపంపు గతకొన్ని నెలలుగా చెడిపోయింది. అయినా మరమ్మతు చేపట్టడం లేదు. అధికారులు పట్టించుకుని వెంటనే మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

-విక్రమ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి, సెల్: 85009 94763

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబానికి చేయూత

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన కొడిపెల్లి పోశెట్టి ఇల్లు ఈనెల 13న రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి ఖానాపూర్ వాసి, ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు సహకారంతో మిత్ర బృందం సభ్యులు సోమవారం నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. శ్రీనివాస్, భీమేశ్వర్, సంగర్తి రాజన్న, ఆడెపు రవి, మడిగెల అనిల్, బొజ్జ వెంకటేశ్, విజయ్, సాగర్, రాజేశ్వర్ ఉన్నారు.

ఆర్‌ఎంపీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సోన్: ఆర్‌ఎంపీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్‌ఎంపీల సంఘ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ అన్నారు. మండలంలోని కడ్తాల్ గ్రామంలో సోమవారం జిల్లా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి వెంటనే గుర్తింపు కార్డులు అందించాలన్నారు. సమావేశంలో నవీన్ కుమార్, వెంకటస్వామి, రమేశ్ యాదవ్, నవకాంత్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ముథోల్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేశ్ వాహనాలను ఆపి తనిఖీ చేశారు. వాహనదారులు తమ వెంట వాహన ధ్రువపత్రాలు తెచ్చుకోవాలన్నారు. ఏఎస్సీ లక్ష్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

ఈరోజు

నేడు సత్యనారాయణ వ్రత పూజలు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు సంజీవ్ పూజారి తెలిపారు.

బాసరలో రైతు నేస్తం

బాసర: స్థానిక రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా రైతులకు వరి కొయ్యలు కాల్చితే జరిగే నష్టాలపై అవగాహన కల్పించనున్నట్లు ఏవో అజయ్‌కుమార్ తెలిపారు.

యోగా శిక్షణ తరగతులు

కుంటాల: పీహెచ్‌సీలో మంగళవారం ఉదయం 6:30 నుంచి 7:30 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాజబాపు ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షకురాలు మౌనిక శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.